

'ఇందిరమ్మ' సర్వే షురూ..
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్వే ప్రారంభించారు.
8లో



అమ్మకు ఆపద..!
ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తహీనతతో బాధపడు తున్న బాలికలు, మహిళల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.
8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
29°/ 16
జిల్లాలో శుక్రవారం వాతావరణం చల్లగా ఉంటుంది. కొద్దిసేపు ఎండ, అనంతరం మరికొంత సేపు మబ్బులు ఏర్పడతాయి.

న్యూస్‌రీల్

కమనీయం.. కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో గురువారం రామయ్య నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రికార్డ్ స్థాయిలో విద్యుదుత్పత్తి

కేటీపీఎస్ 6వ దశలో నిర్విరామంగా 100 రోజులు పూర్తి



సీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారంలోని 6వ దశలో విద్యుత్ ఉత్పత్తి రికార్డ్ స్థాయిలో నడుస్తోంది. 500 మెగావాట్ల సామర్థ్యం గల 11వ యూనిట్‌లో విజయవంతంగా ఉత్పత్తి అందిస్తూ గురువారం నాటికి 100 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావును కలిసి మొక్క అందించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సీఈ మాట్లాడుతూ ఇంజనీర్లు, ఉద్యోగుల సమష్టి కృషితోనే ఉత్పత్తి సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో మెరుగైన ఉత్పత్తి సాధించాలన్నారు. బ్రాంచ్ కార్యదర్శి డి.ఉమా మహేశ్వరరావు, చంద్రకళాధర్, ఎం.శ్రీనివాసరావు, రాజబాబు, పావని, శ్రీలక్ష్మి, మధుసూదన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని టీడీఏ పీఓ బి. రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. www. telangana epass. cgg. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న బాలురకు రూ.వెయ్యి, బాలికలకు రూ.1500 మంజూరవుతాయని పేర్కొన్నారు. రాజీవ్ విద్యా దీవెన స్కీం ద్వారా 9, 10వ తరగతులు చదువుతున్న వారికి రూ.2,250, హాస్టల్‌లో చదివే విద్యార్థులకు రూ.4,500 మంజూరవుతాయని వివరించారు. విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో ఈ నెల 31వ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

సంచార ముస్లింలను గుర్తించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్

చంద్రుగొండ : సంచార ముస్లిం తెగలను గుర్తించి, ప్రభుత్వం చేయూత అందించాలని సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ డిమాండ్ చేశారు. మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో గురువారం ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంచార ముస్లింలు సమాజంలో ఎదగాలంటే ఐక్యంగా ఉండాలన్నారు. హుస్సేన్, బాద్షా, మునీర్, అహ్మద్ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ అడ్మిషన్ గడువు పెంపు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్ గడువును ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ పాపారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దూర విద్యావిధానంలో చదువుకోవాలనుకునే వారు ఓపెన్ స్కూల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను, 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పులి కలకలం



ఇల్లెందు రూరల్: ఇల్లెందు-పాకాల కొత్తగూడెం ఏజెన్సీలో ఉన్న పాండవుల గుట్ట

జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారుల గాలింపు

- గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం ప్రాంతాల్లో జాడలను వెదుకుతున్న సిబ్బంది
- ములుగు జిల్లా నుంచి ఇటు వచ్చినట్లు చెబుతున్న తాడ్వాయి అధికారులు
- మూడేళ్లుగా ఏజెన్సీ గ్రామాల ప్రజలను వణికిస్తున్న జాతీయ జంతువు

ఇల్లెందురూరల్/చుంచుపల్లి: ఆదిలాబాద్ జిల్లాలో కొంతకాలం హడలెత్తించిన పెద్దపులి క్రమంగా కరీంనగర్, వరంగల్, ములుగు జిల్లాలు దాటుకుంటూ భద్రాద్రికొత్తగూడెం జిల్లాకి ప్రవేశించింది. పాదముద్రల ఆధారంగా పులి భద్రాద్రి జిల్లాలోకి వచ్చినట్లు ములుగు జిల్లా తాడ్వాయి అటవీశాఖ అధికారులు తెలిపినట్లు ఇక్కడి అధికారులు చెబుతున్నారు. గురువారం కరకగూడెం మీదుగా గుండాల వైపు పెద్దపులి ప్రయాణం సాగినట్లు అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో జిల్లాలోని అడవికి ఆనుకుని ఉన్న ఏజెన్సీ మండలాల్లో అటవీశాఖ అప్రమత్తమైంది.

మేటింగ్ సీజన్ కావడంతో..

సాధారణంగా చలికాలం అంటే నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పులులకు మేటింగ్ (సంభోగం) సీజన్. ఈ సమయంలోనే మగ పెద్దపులి ఆడతోడు కోసం వెదుకుతుంది. దశాబ్దాల క్రితం పులలకు ఆవాసాలుగా ఉన్న ప్రాంతాల్లో కలియతిరిగే అలవాటు ఉంటుంది. ఈ క్రమంలో గోదావరి పరీవాహక ప్రాంతం వెంట అక్టోబర్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించిన పులి తాజాగా జిల్లాలోకి ప్రవేశించింది.

నాలుగేళ్ల క్రితం కూడా ఆడ పులి కోసమే..

నాలుగేళ్ల క్రితం జిల్లాలో పెద్దపులి సంచారం కనిపించింది. 2020 నవంబర్‌లో మగపెద్దపులి ఆడతోడు కోసం ములుగు జిల్లా నుంచి కరకగూడెం, ఆళ్లపల్లి, మామకన్ను అటవీ ప్రాంతాలలో సంచరించింది. అక్కడి నుంచి ఇల్లెందు మండలంలో పాండవుల గుట్ట మీదుగా మహబూబాబాద్ జిల్లాలోకి ప్రవేశించి తిరిగి ఆదిలాబాద్ దిశగా తన ప్రయాణం కొనసాగించింది. ఆ సమయంలో జిల్లాలో ఎక్కడా మనుషులపై దాడి చేసిన ఘటన లేకపోవడంతో మ్యాన్‌ఈటర్ కాదని, ఆడతోడు కోసమే ఇటుగా వచ్చినట్లు అటవీశాఖ అధికారులు అప్పట్లో పేర్కొన్నారు. ఆ తర్వాత 2022లో మరోసారి పెద్దపులి సంచారం తిరిగి చలికాలంలోనే సాగింది.

అప్రమత్తమైన అధికారులు

పెద్దపులి సంచారం జిల్లాలోకి ప్రవేశించడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. అడవిని ఆనుకొని ఉన్న ములుగు జిల్లా సరిహద్దు గుండాల, ఆళ్లపల్లి మండలాలకు పెద్దపులి చేరుకుందన్న ప్రచారం జరగడంతో జాడ కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇల్లెందు మండలం కొమరారం అటవీరేంజ్ పరిధిలో కూడా గాలింపు చేపట్టారు. ఆళ్లపల్లి మండలంతోపాటు అడవికి సరిహద్దున ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో పాదముద్రలను పరిశీలిస్తున్నారు. పలు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాలతో ములుగు జిల్లాకు సరిహద్దున ఉన్న అటవీ ప్రాంతంలో గాలింపు, పాదముద్రల పరిశీలన చేపడుతున్నట్లు కొమరారం రేంజ్ అధికారి ఉదయ్ తెలిపారు. పాండవుల గుట్ట, ఏడు బావుల ప్రాంతంలో నిఘా పెంచామని వివరించారు.

పూర్వం పులులకు అడ్డాగా..

పూర్వం భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, గుండాల, పాండవుల గుట్ట, పూర్వవరంగల్ జిల్లా పాఖాల కొత్తగూడెం అటవీ ప్రాంతం పెద్దపులుల సంచారానికి అడ్డాగా ఉండేది. 2000 సంవత్సరంలోనూ ఈ ప్రాంతం దట్టమైన అడవులతో అల్లుకుపోయి ఉండేది. పులుల నివాసానికి అనుగుణంగా కనిపించే గుహలు పాండవుల గుట్ట ఏడు బావుల ప్రదేశాల్లో నేటికీ దర్శనమిస్తాయి. ఆ రాళ్ల సముదాయాన్ని పులి గుహగా పిలుస్తుంటారు. 2000 సంవత్సరంలో నవంబర్‌లోనే ఈ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు ప్రచారంలో ఉంది. బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామానికి చెందిన ఓ గిరిజన రైతుకు చెందిన రెండు ఆవులను పెద్దపులి సంహరించింది. గ్రామ సమీపం వరకు దట్టమైన అడవి ఉండటంతో పులి సంచారాన్ని నాడు గిరిజనులు పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత పులుల ఆవాసంగా గుర్తింపు పొందిన పాండవుల గుట్ట అటవీ ప్రాంతంలో రెండు దశాబ్దాల తరువాత అంటే 2020లో, ఆ తర్వాత 2022లో పెద్దపులి సంచరించింది. ప్రస్తుతం మరో రెండేళ్ల తర్వాత తాజాగా మరోసారి పెద్దపులి జిల్లాలోకి ప్రవేశించి పాండవుల గుట్టకు చేరుకునే దిశగా తన ప్రయాణం సాగిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు అనుమానించి అప్రమత్తమయ్యారు.

కిన్నెరసాని అభయారణ్యంలోకి ప్రవేశించిందా..?

గుండాల: మూడు, నాలుగేళ్లుగా జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చలికాలంలో జాతీయ జంతువు అడుగుజాడలు కనిపిస్తుండగా, ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలకు కంటిమీద కునుకు ఉండటంలేదు. మళ్లీ పులి వచ్చిందని అటవీశాఖ అధికారులు చెబుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో పులి వచ్చినట్లు ప్రచారం సాగుతుండటంతో ప్రజలు వణికి పోతున్నారు. మూడు రోజుల పాటు ములుగు జిల్లాలో సంచరించిన పులి మంగపేట, మల్లూరు అటవీ ప్రాంతాల నుంచి సరిహద్దు దాటి జిల్లాలోకి అడుగుపెట్టిందనే సమాచారం అటవీశాఖ అధికారులకు అందింది. దీంతో గుండాల, ఆళ్లపలి, రేగళ్ల, కాచనపల్లి ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గురువారం తెల్లవారు జామున మల్లూరు గుట్టవైపు వెళ్లిందని పేర్కొంటున్నారు. దామరతోగు, రేగళ్ల, మర్కోడు, అడవిరామారం, కొమరారం అటవీ ప్రాంతాల్లోని నీటి కొలను, దారి మార్గాల్లో పులి అడుగుజాడలను గుర్తించే పనిలో ఉన్నారు. అడవుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. పశువుల కాపరులు అడవులకు వెళ్లొద్దని, వ్యవసాయ పనులకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. తాడ్వాయి అడవి దాటిన పెద్దపులి దామరతోగు, రేగళ్ల, అడవిరామారం అడవి మార్గంలోని కిన్నెరసాని అభయారణ్యంలోకి ప్రవేశించవచ్చని భావిస్తున్నారు. ఎక్కడ ఏం జరుగుతుందోనని గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



అటవీ ప్రాంతంలో పులి అడుగుజాడల కోసం గాలింపు చేపడుతున్న అధికారులు

నాణ్యమైన భోజనం అందించాలి



మెనూ పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పాల్వంచ: బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. గురువారం ఆయన పాల్వంచ బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్ర తాగునీరు, ఆహారం అందించాలని ఆదేశించారు. కిచెన్ గార్డెన్‌లో మునగ, చింత, కరివేపాకు, పనస, వెలగ, ఉసిరి చెట్లు పెంచాలన్నారు. విద్యార్థులతో ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని వివరించారు. వందశాతం ఫలితాలు సాధించాలని సూచించారు.

వ్యవసాయంపై అవగాహన అవసరం

టేకులపల్లి: విద్యార్థి దశలోనే వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. గురువారం టేకులపల్లి ఏకలవ్య మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులు సేకరించిన మట్టి నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏకలవ్య విద్యార్థులు మట్టి నమూనాలు సేకరించి, పరీక్షించి, ఫలితాలను రైతులకు వివరించడం అభినందనీయమని అన్నారు. ఇదే తరహా పద్ధతిని ఆశ్రమ పాఠశాలల్లో కూడా అమలు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. మట్టి నమూనాల పరీక్షల ద్వారా నేలలో ఉండే ఎన్‌పీకే, ఎంపీటీల స్థాయిలను తెలుసుకుని, అందుకు తగిన పంటలు సాగు చేసేలా రైతుల్లో చైతన్యం తేవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అనంతరం తమకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఏకలవ్య పాఠశాల ఏర్పాటుకు స్థలం ఇచ్చిన భూ నిర్వాసితులు భూక్య హర్ష, భూక్య నారాయణలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఇ.ఇందిర, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వేల్పుల బాబూరావు, ఇతర అధికారులు లాల్‌చంద్, సాయి నారాయణ, నాగభవాని, రవీంద్రరావు, అన్నపూర్ణ, జీఎల్ గాంధీ, శ్రావణి, రమేష్, నిశాంత్ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



ఏకలవ్య మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మధ్యాహ్న భోజనం పరిశీలన

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి ప్రకాష్‌నగర్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను వరంగల్ రీజియన్ విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో గతంలో ఎంఈఓగా పనిచేసిన వనమా వెంకటేశ్వరరావుపై ఆరోపణలు రాగా, ఆయన విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ప్రగతిని మూల్యాంకనం చేశారు. రాబోయే వార్షిక పరీక్షలకు పదో తరగతి విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మందలపల్లి ప్రాథమిక పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్జేడీ సీసీ మాధవరావు, ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ ఆర్జేడీ, ఎంఈఓ

దరఖాస్తులపై శాస్త్రీయ అధ్యయనం



కుల సంఘాల నాయకుల అభిప్రాయాలు వింటున్న ఎస్సీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

- ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిస్తాం
- రాష్ట్ర ఎస్సీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా హాజరైన కుల సంఘాల నేతలు
- తల్లంపాడులో క్షేత్రస్థాయి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కోసం స్వీకరించిన దరఖాస్తులపై శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేస్తామని, అన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని రాష్ట్ర ఎస్సీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్సీ కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో గురువారం బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎస్సీ కులాల సంఘాల నాయకులు, వ్యక్తులు దరఖాస్తులు అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందిస్తామని చెప్పారు. ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఇప్పటికే రంగారెడ్డి, నల్లగొండ తదితర జిల్లాల్లో బహిరంగ విచారణ నిర్వహించామని తెలిపారు. జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారు హైదరాబాద్ లో నేరుగా కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని వివరించారు. ఉప వర్గీకరణపై నిర్వహించిన బహిరంగ విచారణలో 450 మంది వ్యక్తిగతంగా, కుల సంఘాల పరంగా దరఖాస్తులు సమర్పించారని పేర్కొన్నారు. అంతకుముందు కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్‌కు ఎన్నెస్పీ అతిథిగృహం వద్ద కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, ఖమ్మం ఎస్సీ కార్పొరేషన్ డీడీ కస్తాల సత్యనారాయణ, భద్రాద్రి జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి అనసూయ, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు నవీన్ బాబు, ఉపేందర్‌రావు, రాష్ట్ర కార్యాలయ సూపరింటెండెంట్ సజ్జన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లంపాడులో పర్యటన

ఖమ్మంరూరల్ : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ మండలంలోని తల్లంపాడు ఎస్సీ కాలనీలో గురువారం విచారణ నిర్వహించారు. కాలనీ వాసుల కుటుంబ వివరాలు, ఎంతమంది ఉద్యోగాలు చేస్తున్నారు, భూములు ఉన్నాయా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలను బాగా చదివించాలని, చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం కలుగుతుందని తెలిపారు. ఉపాధికి చేపడుతున్న పనులు, ప్రభుత్వం నుంచి పొందుతున్న సాయంపై ఆరా తీశారు. కాలనీ వాసులు చెప్పిన ప్రతీ విషయాన్ని శ్రద్ధగా విని నమోదు చేసుకున్నారు. కమిషన్ చైర్మన్ వెంట తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పొలాలకు సౌర విద్యుత్..

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: పీఎం కుసుమ్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్లను నెలకొల్పడానికి అనువైన గిరిజన పంట పొలాలను గుర్తించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో ఫారెస్ట్, విద్యుత్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, ఐకేపీ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేస్తుందని తెలిపారు. సబ్ స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పోడు భూములను గుర్తించి, ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. ఏజెన్సీ ఏరియాలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మెగా వాట్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి మహిళలకు 90 శాతం బ్యాంకు రుణం లభిస్తుందని, 10 శాతం లబ్ధిదారుల వాటా ఉంటుందని వివరించారు. ఈ ప్లాంట్లతో పర్యావరణ పరిరక్షణతోపాటు గిరిజన గ్రామాలకు, పంట పొలాలకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. అటవీ వివాదాలు ఉన్న పొలాల జోలికి వెళ్లొద్దని, అవసరమైతే సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన భూమిని లీజుకు తీసుకుని ఏర్పాటు చేయాలని చెప్పారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి గ్రామంలో కొండరెడ్ల గిరిజనులకు పోడు పట్టాలు అందడం లేదని దరఖాస్తులు వస్తున్నాయని, 2005 ముందు ఉన్న వారిని గుర్తించి వారికి పోడు పట్టాలు అందించాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, మహేందర్ రెడ్డి, భాస్కరన్, లక్ష్మీనారాయణ, మునీర్ పాషా, ఫారెస్ట్, వ్యవసాయం, విద్యుత్ శాఖ అధికారులు, ఐకేపీ ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ రాహుల్

నూతన మెనూ ప్రదర్శించాలి

గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డైట్, కాస్మోటిక్ చార్జెస్, నూతన మెనూ వివరాలను ప్రదర్శించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక సెక్రటరీ శరత్ అన్నారు. హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం నుంచి అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్ రెడ్డితో కలిసి గురువారం ఆయన ఐటీడీఏ పీఓలు, డీడీ, డీటీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 14న నిర్వహించే ఓరియంటేషన్ ప్రోగ్రాంకు తీసుకోవాల్సిన కార్యాచరణపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంటగది స్టోర్ రూమ్ శుభ్రంగా ఉండేలా సంబంధిత వార్డెన్లు, హెచ్‌ఎం చూసుకోవాలన్నారు. పాఠశాల ముందు ప్రత్యేకంగా టెంట్లు వేయించి పిల్లల తల్లిదండ్రులకు, అతిథులకు నూతన మెనూ వివరించాలన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ మాట్లాడుతూ ప్రోగ్రాంకు తల్లిదండ్రులకు అందరూ హాజరయ్యేలా చూస్తామని తెలిపారు. సహపంక్తి భోజనం చేసేలా ప్లాన్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఆర్సీఓ నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రూప్–2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలకు 38 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 13,465 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. హాల్‌టికెట్లు, గుర్తింపు పొందిన ప్రభుత్వ ఐడీ కార్డు పరిశీలించాలన్నారు. నిర్దేశించిన రూట్లలో మాత్రమే ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ పత్రాలు తీసుకెళ్లాలని, పోలీస్ బందోబస్తు నిర్వహించాలని వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ అధికారులు, అబ్జర్వర్లు, ఐడెంటిఫికేషన్ అధికారులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులకు సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లో 93929 19706, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నంబర్లు 040–23542185, 040–23542187లో సంప్రదించాలని కోరారు. పరీక్షల కన్వీనర్ హరికృష్ణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టం వివరించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వివరించారు. మానసిక ఒత్తిడి నివారణకు 14416 టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సులోచనారాణి, స్ట్రెస్ మేనేజ్మెంట్ అధికారి ఆదిశేషు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

క్లుప్తంగా

అన్నారుగూడెం వాసి.. అమెరికాలో పీహెచ్‌డీ


అమెరికాలో డాక్టరేట్ పొందిన శ్రీనివాస్

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన చీకటి శ్రీనివాస్ అమెరికాలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. చీకటి వెంకటేశ్వర్లు, శాంతమ్మ కుమారుడు శ్రీనివాస్ అమెరికాలోని టెక్సాస్ స్టేట్ ఆఫ్ రియో గ్రాండ్ వ్యాలీ యూనివర్సిటీలో చదివి అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కొలువు సాధించారు. టెక్సాస్ రాష్ట్రంలో 2019 – 2024 మధ్య కాలంలో యూనివర్సిటీ ఆఫ్ కుంబర్ ల్యాండ్స్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అమెరికాలో డాక్టరేట్ అందుకున్న శ్రీనివాస్‌ను తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు గురువారం ఫోన్‌లో అభినందించారు.

మిరపతోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


మిరప తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఏన్కూరు: మండల పరిధిలోని భగవాన్‌నాయక్‌తండాలో సాగు చేసిన మిరపతోటలను గురువారం వైరా కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవికుమార్, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం పూత పిందె దశలో ఉన్న మిరపకు కొమ్మకుళ్లు తెగులు ఆశించిందన్నారు. ఈనేపథ్యాన తోటకు సూక్ష్మ పోషకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని, తద్వారా మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మిరపలో ఎండుతెగులు లక్షణాలు, నల్ల తామర పురుగులు, తెల్లదోమ తదితర వాటి నివారణ చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్సింహారావు, ఏఈఓ లహరి పాల్గొన్నారు.

11 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో గురువారం 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ మేరకు సుకుమా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ కిరణ్ జి.చవాన్ వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయే మావోయిస్టులకు కల్పిస్తున్న పునరావాసం గురించి సీఆర్‌పీఎఫ్ సెకండ్ ఇన్ కమాండెంట్ అమిత్ ప్రకాశ్, డిప్యూటీ కమాండెంట్ గన్వీర్‌లు సుకుమా జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 11 మంది మావోయిస్టులు లొంగిపోయేందుకు ముందుకు రాగా వారిని జిల్లా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి సాయం అందించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని జేకే కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి కొత్త జనార్దన్‌రెడ్డి కుమారుడు 27 ఏళ్ల కొత్త సాయికార్తీక్‌రెడ్డి అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. నవంబర్ 9న ఉదయం ఇంటి నుంచి కొత్తగూడెంకు ఉద్యోగం రీత్యా వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ములకలపల్లి: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌హెచ్‌ఓ లక్ష్మణ్ కథనం ప్రకారం.. మండలపరిధిలోని వేముకుంట గ్రామానికి చెందిన కొండ్రు నగేశ్ (30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై గత కొంతకాలంగా పనులకు వెళ్లకపోవడంతో బుధవారం మద్యం మానేసి అండగా ఉండాలని కుటుంబీకులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై అదేరోజు అర్ధరాత్రి పురుగుల మందు సేవించాడు. గురువారం తెల్లవారుజామున అతడి నోటి నుంచి నురగలు రావడంతో హుటాహుటిన పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి వీరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

హోటల్ వ్యాపారి ఐపీ

ఖమ్మం లీగల్ : మధిర మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎం.మనోహర్ రూ.47,97,983కు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. ఫిర్యాదు దారుడు హోటల్, మినరల్ వాటర్ ప్లాంట్ వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రైవేట్ వ్యక్తులు, బంధువుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావడంతోపాటు రుణదాతల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో 14 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

అమ్మకు ఆపద..!


భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

- అధికశాతం గర్భిణుల్లో రక్తహీనత
- ప్రతి ఏటా పెరుగుతున్న సంఖ్య
- చిన్నారుల్లోనూ పోషకాహార లోపం
- మహిళల్లో కొరవడిన అవగాహన

భద్రాచలంఅర్బన్: ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు, మహిళల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. పౌష్టికాహార లోపంతో మాతాశిశు మరణాల సంఖ్య పెరుగుతోందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. మారుతున్న జీవనశైలి, ఆహారంలో పోషకాలు లోపించడంతో చాలామంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతూ ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇది పురుషులతో పోలిస్తే స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తోంది. శరీరంలో హిమోగ్లోబిన్ తక్కువగా తయారవడం వలన ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గడంతో రక్త హీనత (ఎనీమియా) సమస్యకు దారితీస్తుంది.

రక్తహీనత రకాలు..

ఎర్ర రక్తకణాలలో కనిపించే హిమోగ్లోబిన్ అనే ప్రొటీన్ సరైన మోతాదులో శరీరంలో లేకపోవడంతో రక్తహీనతకు దారితీస్తుంది. దీంతో అవయవాల పరితీరు సరిగా పని చేయక అనారోగ్యాల బారిన పడతారు. సాధారణంగా ఆడవారిలో ప్రతీ 100 మిల్లీలీటర్ల రక్తంలో 12 గ్రాములు, గర్భిణుల్లో 11 గ్రాములు, బాలింతల్లో 12 గ్రాముల కన్నా రక్తం తగ్గితే వారు రక్తహీనతను కలిగి ఉన్నారని భావించాలి. రక్తహీనతతో మూడు రకాలు ఉంటాయి. అందులో రక్తం కోల్పోవడం వలన వచ్చే రక్తహీనత, ఎర్రరక్త కణాల ఉత్పత్తి తగ్గడం వలన వచ్చే రక్తహీనత, ఎర్ర రక్తకణాలు నాశనం కావడం వలన వచ్చే రక్తహీనత.. అనేవి ఉంటాయి.

స్త్రీలల్లోనే అధిక సమస్య..

రక్తహీనత సమస్య స్త్రీలల్లోనే ఎక్కువగా ఉత్పన్నం అవుతుంది. తగినంత పౌష్టికాహారం తీసుకుంటే దీని నుంచి బయట పడొచ్చు. బాలింతలు, గర్భిణులే కాకుండా సాధారణ మహిళల్లో కూడా రక్తహీనత ఉండడం ఆందోళన కలిగించే విషయం. అవగాహన లోపమే ఇందుకు కారణమని తెలుస్తోంది. వైద్య సదుపాయం పొందిన మందులు వాడకపోవడం, పౌష్టికాహారం తీసుకోకపోవడం తదితర కారణాలతో గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడుతున్నారు. ఆహార నియమాలు పాటిస్తూ సరైన సమయంలో వైద్యం తీసుకుంటే ఈ పరిస్థితి ఉంచి బయట పడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కాగా, ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఈ సమస్య చాలా ఎక్కువగానే ఉంది. అంటే 100 శాతానికి 150 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారంటే ఏజెన్సీలో రక్తహీనత సమస్య ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రధాన కారణాలు..

రక్తంలో ఐరన్ లోపం వల్ల రక్తహీనతకు గురవుతారు. ముఖ్యంగా మహిళలు గర్భం దాల్చిన సమయంలో తల్లీబిడ్డకు ఐరన్ అవసరం. అయితే శరీరంలో రక్తం తయారు కావడానికి అవసరమైన ఫోలిక్ యాసిడ్, కాల్షియం, విటమిన్ సీ ఉన్న ఆహారం ఇవ్వాల్సి ఉంటుంది.

రక్తహీనత లక్షణాలు..

- స్త్రీలు పాలిపోయినట్లు కనిపించడం.
- ముఖం ఉబ్బినట్లుగా కనిపించడమే గాక అలసిపోయినట్లు ఉండడం.
- శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడడం.
- గోళ్లు తెల్లగా ఉండడంతో పాటు సన్నగా, బలహీనంగా ఉండడం.
- అతి నీరసంగా ఉంటూ కాళ్లు, వేళ్లలో వాపు కనిపించడం.
- హిమోగ్లోబిన్ పరీక్షించినప్పుడు 10 గ్రాముల కంటే తక్కువగా ఉండడం.

నివారణ చర్యలు..

- రోజూ ఒక గ్లాసు పాలు తాగడం, ఒక గుడ్డుతో పాటు ఏదోక పండు తినాలి.
- ఆరు బయట నడిచేటప్పుడు చెప్పులు వేసుకోవాలి.
- ఐరన్, ఫోలిక్‌యాసిడ్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తినాలి.
- అధిక రక్తస్రావం, మొలలు, మలేరియా లాంటి సమస్యలు ఉంటే చికిత్స చేయించుకోవాలి.
- ప్రసవం తర్వాత 4వ నెల నుంచి మూడు నెలల పాటు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను వాడాలి.
- ఆకుకూరలు, కూరగాయలు, వేరుశనగ పప్పు, మాంసం, చేపలను ఆహారంలో తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. పోషక విలువలు లోపించకుండా ఆహారాన్ని తీసుకోవాలి. ప్రసవం తర్వాత కూడా ఆరు నెలల వరకు హిమోగ్లోబిన్ సాధారణ స్థాయి కంటే తక్కువ ఉంటే వెంటనే ఆస్పత్రికి తరలించాలి. డాక్టర్ సూచన మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ శ్రీనిధి, గైనకాలజిస్ట్, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

పౌష్టికాహార లోపంతోనే ..



పౌష్టికాహారం లోపం వల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కలుగుతోంది. ఆకుకూరలు, కూరగాయలు, మాంసకృతులు కలిగిన ఆహారంతో పాటు బెల్లం – శనగ ఉంటలు తింటే ఐరన్ వస్తుంది. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

– డాక్టర్ సంతోష్, ఆర్ఎంఓ, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

'ఇందిరమ్మ' సర్వే షురూ..

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన కార్యదర్శులు
- జిల్లాలో 2,79,638 దరఖాస్తులు
- ప్రత్యేక యాప్ ద్వారా వివరాల నమోదు


దుమ్ముగూడెం- బి.కొత్తగూడెంలో యాప్‌లో ఫొటో తీస్తున్న కార్యదర్శి

చుంచుపల్లి: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు గురువారం నుంచి సర్వేను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. అసలు సోమవారం నుంచే సర్వేను చేపట్టాల్సి ఉండగా.. ఈ సర్వేలో ఎదురవుతున్న సమస్యలతో పాటు నిత్యం విధుల నిర్వర్తించడంలో ఏర్పడే సమస్యలతో సర్వే నుంచి మినహాయించాలని కోరుతూ కార్యదర్శులు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు విన్నవించారు. ఆ తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేసేందుకు కార్యదర్శులు ముందుకొచ్చారు.

మొత్తం 2,79,638 దరఖాస్తులు..

గతేడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,79,638 దరఖాస్తులు వచ్చాయి. ఈనేపథ్యాన తొలి దశలో సొంత జాగా కలిగి ఉన్న నిరుపేదలను ఈ పథకానికి ఎంపిక చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించింది. గ్రామాల వారీగా కార్యదర్శులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి, వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈక్రమంలో దరఖాస్తుదారులు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇల్లు సొంతదా లేక అద్దెదా, ఏ రకమైన కట్టడం, ఇంటి స్థలం ఉంటే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇంటి బయట, పైకప్పు, ఇంటి లోపలి ప్రాంతాలను జీపీఎస్‌తో లింక్ చేసి, ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దరఖాస్తుదారుల సర్వే అనంతరం అధికారులు జాబితాను గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీలకు అప్పగిస్తారు. ఆయా కమిటీల సభ్యులు జాబితాలోని పేర్లను పరిశీలించి, అర్హులను ఎంపిక చేస్తారు.

మహిళల పేరిట ఇళ్లు..

ప్రభుత్వం ఒక్కో నియోజవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేసింది. సొంత స్థలం ఉండి, అసలే ఇల్లు లేని పేదలకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలను మూడు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నెలాఖరు లోగా సర్వే పూర్తి చేయాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ సర్వేను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ, నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవాలపై అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని, నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని కేటాయించాలన్నారు. భద్రాచలం, కొత్తగూడెం ఆర్డీఓలు ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థలం గుర్తించి త్వరితగతిన మోడల్‌హౌస్ నిర్మించాలని ఆదేశించారు. ఈనెల 15, 16 తేదీలలో నిర్వహించే గ్రూప్ 2 పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిల్లలకు అందించే డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, దీని ప్రారంభోత్సవానికి పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం జరగాలని, ఆ రోజు విద్యార్థులకు స్పెషల్ ఆహారం అందించాలని, ప్రతీ విద్యా సంస్థల మెనూకు సంబంధించి వివరాల ఫ్లెక్సీ ప్రచురణ చేయాలని తెలిపారు. ఈ వీసీలో జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీతో అక్రమాలు వెలుగులోకి..!

- రికవరీ రూ.1,16,543
- జరిమానా రూ.39 వేలు

అశ్వారావుపేటరూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో సిబ్బంది చేతివాటం, అవకతవకలు సామాజిక తనిఖీ వేదిక ద్వారా వెలుగులోకి వచ్చాయి. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీ బహిరంగ చర్చ వేదిక గురువారం కూడా కొనసాగింది. ఈ వేదికలో మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో 10 తనిఖీ బృందాలతో చేపట్టిన తనిఖీల్లో సిబ్బంది చేసిన అక్రమాలతోపాటు అవకతవకల ఆధారాలతో సహా వెల్లడించారు. ఈ తనిఖీల్లో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ ద్వారా చేపట్టిన 460 పనులకు కూలీల వేతనాలు, మెటీరియల్ కింద మొత్తం రూ.7,40,88,175ల ఖర్చు పెట్టగా.. దీనిలో రూ.1,16,543 అక్రమాలు వెలుగుచూశాయి. ఈ నగదును ఉపాధి హామీ సిబ్బందితో పాటు పనులు పర్యవేక్షించిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల నుంచి రికవరీకి డీఆర్‌డీఏ ఏపీడీ నల్లబోతుల రవి ఆదేశించారు. అదే విధంగా పనులు, నమోదులో చేసిన పొరపాట్లకు గాను రూ.39వేలు జరిమానా విధించారు. కాగా అక్రమాలు, రికవరీలో నందిపాడు గ్రామ పంచాయతీ ప్రథమ స్థానంలో ఉండగా, జరిమానాలో కన్నాయిగూడెం పంచాయతీ ప్రథమ స్థానంలో ఉంది.

న్యాయం చేయాలి


మాట్లాడుతున్న బాధితుడు బోడ సూర్య

టేకులపల్లి: కన్న తల్లి కర్మకలకు డబ్బులు ఇస్తానని ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని మనుమడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు గురువారం బాధితుడు బోడ సూర్య టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులకు తన గోడును వెలిబుచ్చాడు. బోడ సూర్య నాయనమ్మ గతేడాది మార్చిలో మృతి చెందింది. ఈమెకు ఐదుగురు కుమారులు. అయితే కర్మకాండలకు ముందుగా తనను పెట్టుబడి పెట్టమని మృతురాలి కుమారులు, కుటుంబీకులు కోరడంతో తాను సుమారు రూ.6లక్షలు అప్పు చేసి కర్మకాండలు జరిపించానన్నాడు. రెండేళ్లు కావొస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదని అడిగితే బెదిరిస్తున్నారని, ఇప్పుడు నాయనమ్మ ఆస్తిని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించాడు. చేసిన అప్పు తీర్చలేక కుటుంబమంతా ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతూ టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిజానిదే..


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంరూరల్: ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిజానికి మాత్రమే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం మండలంలోని ఏదులాపురంలో జరిగిన సీపీఎం పాలేరు డివిజన్ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో కమ్యూనిస్టులకు అనుకూల వాతావరణం ప్రారంభమైందని, శ్రీలంక, నేపాల్, ఫ్రాన్స్ దేశాల్లో ఎర్రజెండా ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులకు ఎదురు దెబ్బలు తగులుతున్నాయని, గత కొన్నేళ్లుగా మంచి రోజులు ప్రారంభమయ్యాయన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు కమ్యూనిస్టులు ముందుండి పోరాడుతున్నారని, లగచర్లలో వేల ఎకరాల గిరిజనుల భూమిని ఫార్మా కంపెనీలకు కేటాయించకుండా ఆపిన ఘనత వామపక్షాలదేనన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 5 లక్షల ఎకరాల భూములకు పోడుపట్టాలు ఇవ్వడంలో ప్రధాన పాత్ర కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని. సుదర్శన్ మాట్లాడుతూ బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌తో జతకట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వ తప్పు చేస్తే నిలదీస్తామని తెలిపారు. అనంతరం డివిజన్ కమిటీ కార్యదర్శిగా బండి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు నంద్ర ప్రసాద్, శ్రీకాంత్, కళ్యాణం వెంకటేశ్వరరావు, షేక్ బషీరుద్దీన్, డి.తిరుపతిరావు, జి.నాగేశ్వరరావు, వి.సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఘర్షణ..

కూసుమంచి: నాయకన్‌గూడెంలో గురువారం ఇరు వర్గాల మధ్య జరిగిన భూవివాదంలో ఘర్షణ చోటుచేసుకోగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శనగ రాములు, కందుల శ్రీరాములు కుటుంబాల మధ్య భూ వివాదం చోటుచేసుకుంది. ఈనేపథ్యాన ఇరు వర్గాల వారు గొడ్డళ్లు, కర్రలు, రాళ్లతో ఘర్షణకు పాల్పడ్డారు. ఈక్రమంలో ఇరు వర్గాలకు చెందిన తొమ్మిది మందికి తీవ్ర గాయాలు కాగా వారికి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. బాధితులైన శనగ వీరబాబు, శనగ శ్రీను, కందుల రాజా పరస్పర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

చిరస్మరణీయుడు 'చేకూరి'


సత్యంబాబు(ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మంమామిళ్లగూడెం): చిరు వ్యాపారంతో తన ప్రస్తానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ.. తన తోటి వారికి సహాయ సహకారాలు అందించిన మహోన్నత వ్యక్తి చేకూరి సత్యంబాబు అని, ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. వ్యాపారవేత్త చేకూరి సత్యంబాబు సంస్మరణ సభ గురువారం నగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రముఖులు తరలివచ్చి సత్యంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎందరికో ఉపాధి కల్పించిన వ్యక్తి సత్యంబాబు అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోదరుడు నామ కృష్ణయ్య, గుమ్మడి నర్సయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావుతో పాటు రవిమారుత్, సుబ్బారావు, సత్యనారాయణ, నరేందర్, వీరభద్రం, సైదుబాబు, సౌజన్య, రవీంద్రనాథ్, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, సత్యంబాబు భార్య చేకూరి నాగేంద్రమ్మ, కుమారుడు, కోడలు శ్రీధర్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ నిందితుల అరెస్ట్


పట్టుబడిన నిందితులతో ఎస్ఐ లక్ష్మీభార్గవి, సిబ్బంది

మధిర: మండలంలోని పలు గ్రామాల్లో కొంతకాలంగా చిల్లర కొట్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న దొంగలను గురువారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి తెలిపారు. గురువారం మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. మధిరలో ఇటీవల కాలంలో చోరీలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఉదయం 11 గంటల సమయంలో కృష్ణాపురం సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో ఒక ఆటో మధిర నుంచి వైరా వైపు వెళ్తూ పోలీసులను చూసి తిరిగి వెనక్కు వెళ్తుండడంతో అనుమానం వచ్చి ఆటోను వెంబడించి పట్టుకున్నారు. ఆతర్వాత అందులోని ముగ్గురు వ్యక్తులను విచారించగా.. తాము మద్యానికి అలవాటుపడడంతో డబ్బుల కోసం చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. ఈనేపథ్యాన ఖమ్మం, మధిరలో మూడు చోరీలు చేసినట్లు అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి ఆటో, తోక వెంకటేష్ ఇంటివద్ద దాచిపెట్టిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వారిలో ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల రాజేష్, మధిరకు చెందిన యసారపు రవికుమార్, మధిర మండలం నాగవరప్పాడు గ్రామానికి చెందిన తోక వెంకటేష్, మధిర పట్టణం హనుమాన్ కాలనీకి చెందిన వేముల వెంకటేష్ ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఏన్కూరు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గార్లఒడ్డు సమీపాన ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ క్రషర్ మిల్లు వద్ద ఏపీ 29యూ 6179 అనే లారీలో అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. ఈనేపథ్యాన ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకోగా 63.70 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. లారీని ఏన్కూరు పోలీసులకు అప్పగించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఇంజన్ పల్టీ.. రైతు మృతి


కృష్ణారావు (ఫైల్)

ముదిగొండ: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ పల్టీకొట్టి ఓ రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బాణాపురానికి చెందిన కొత్త కృష్ణారావు(43) అనే రైతు ట్రాక్టర్ ఇంజన్‌తో చల్లసముద్రం చెరువు సమీపంలోని మిరప తోటలో ఉన్న ట్రాలీని తీసుకొచ్చేందుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో చెరువుకట్టపై వెళ్తుండగా.. ట్రాక్టర్ ఇంజన్ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి పల్టీ కొట్టడంతో కృష్ణారావు తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. స్థానికులు గమనించి రైతును బయటకు తీసుకురాగా అప్పటికైనా మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు ముదిగొండ సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మట్టి టిప్పర్ దహనం


కాలిపోతున్న మట్టి టిప్పర్

సత్తుపల్లిటౌన్: అక్రమంగా మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్ షార్ట్ సర్క్యూట్‌తో దహనమైంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని జగన్నాథపురం నుంచి సత్తుపల్లికి అక్రమంగా ఓ టిప్పర్‌లో మట్టి తరలిస్తున్నారు. ఈక్రమంలో కిష్టారం ఓపెన్ కాస్టు వద్దకు రాగానే ఇంజన్‌లో నుంచి అకస్మాత్తుగా పొగలు వ్యాపించడంతో డ్రైవర్ జాతీయ రహదారి పక్కన వాహనాన్ని నిలిపివేసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ ఇంజన్ పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూతుళ్లు ప్రేమ పెళ్లి చేసుకున్నారని..

- పురుగుల మందు తాగిన తండ్రి
- చికిత్స పొందుతూ మృతి

ఖమ్మంక్రైం: కూతుళ్లు ప్రేమ పెళ్లి చేసుకున్నారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. త్రీటౌన్ ఎస్ఐ కోటా నాగేంద్రారావు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం జూపేడకు చెందిన దరబోయిన మల్సూరు(45)కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరు ఖమ్మంలోని శ్రీనివాస్‌నగర్‌లో నివాసం ఉంటుండగా.. గతంలో పెద్దకూతురు, ఇటీవల చిన్న కుమార్తె కూడా ప్రేమ వివాహం చేసుకోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 3న నగరంలోని అయ్యప్ప దేవాలయ సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి మేనల్లుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.